సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



మాదిగల ఐక్యతను చాటాలి

మాదిగల ఐక్యతను చాటి, మహాసభను విజయవతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. 16లో▸



రైతులను ఇబ్బంది పెట్టొద్దు

భూ సమస్యల పరిష్కారం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. 16లో▸



విజేతలకు బహుమతులు

నందివనపర్తి జ్ఞాన సరస్వతి దేవాలయంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. 16లో▸

పద్దుల పర్వం.. భిన్న స్వరం



జనరంజకమైన బడ్జెట్: బీజేపీ

అంతా అంకెల గారడీ: కాంగ్రెస్

పైసా ప్రయోజనం లేదు: వామపక్షాలు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జనరంజక బడ్జెట్‌గా బీజేపీ శ్రేణులు అభివర్ణిస్తే.. అంకెల గారడీ తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నాయి. ఇది పూర్తిగా పెట్టుబడిదారుల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని, దీంతో పేదలకు పైసా ప్రయోజనం లేదని వామపక్ష శ్రేణులు విమర్శించాయి. బడ్జెట్‌లో ఎంఎస్‌ఎంఈలకు భారీగా నిధులు కేటాయించడంతో జిల్లాలోని చిరు వ్యాపారులు, స్టార్టప్‌లకు మేలు చేకూరనుంది. అమృత్ పథకం ద్వారా జిల్లాలోని 18 పట్టణ స్థానిక సంస్థలకు భారీగా లబ్ధి చేకూరనుంది. స్వనిధి పథకం ద్వారా జిల్లాలోని వేలాది మంది వీధి వ్యాపారులు, గిగ్ వర్కర్లకు ఐడీ కార్డులు మంజూరు చేయడంతో పాటు పీఎం జన్ ఆరోగ్య యోజన కింద బీమా కల్పించనుంది. – సాక్షి, రంగారెడ్డిజిల్లా

❖ ప్రజాశ్రేయస్సుతో కూడింది



కేంద్ర బడ్జెట్ జనరంజకమైంది. ఇది లెక్కల పద్దు మాత్రమే కాదు. ప్రధాని నరేంద్రమోదీ దార్శనికత, స్వావలంబన, అభివృద్ధి, ప్రజాశ్రేయస్సుతో కూడిన వికసిత భారత్‌ను నిర్మించే బడ్జెట్. రైతు సంక్షేమం నుంచి మధ్య తరగతి ఉపశమనం వరకు.. మహిళలు, యువత సాధికారత కల్పించడం నుంచి స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించడం, మౌలిక సదుపాయాలు నెలకొల్పడం వరకు అన్ని వర్గాల అభిరుచులకు, ఆశలకు అనుగుణంగా ఉంది.

– బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

❖ అంతా అంకెలగారడీ



కేంద్రఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ అంకెల గారడీని ప్రదర్శించింది. ఈ బడ్జెట్‌తో పేదలకు ఒరిగిందేమీ లేదు. మహిళలకు కనీస ప్రాధాన్యత లేదు. దేశ అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచిన రంగారెడ్డి జిల్లా ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరం. బీజాపూర్ జాతీయ రహదారి ప్రస్తావన లేదు. శాటిలైట్ సిటీల ప్రస్తావన లేదు. రైల్వే ఆర్‌ఓబీల ప్రస్తావన లేదు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్.

– పామెన శ్రీజ్యోతి, మహిళా కాంగ్రెస్, జిల్లా అధ్యక్షురాలు

❖ వివక్ష పూరిత బడ్జెట్



ఇది పూర్తిగా అవకాశవాద బడ్జెట్. కుబేరులు, పెట్టుబడిదారులకు రాయితీలు ప్రకటించి, సామాన్య, మధ్య తరగతిపై పన్నుల భారం మోపింది. కార్మికులు, రైతులపై తీవ్ర భారం మోపింది. కేటాయింపుల్లో తెలంగాణపై పూర్తి వివక్ష చూపింది. ఇద్దరు మంత్రులు ఉండీ పైసా తేలేక పోయారు. లేబర్ కోర్డు రద్దు చేయడానికి పూనుకోలేదు. వ్యవసాయ కార్మికుల, రైతు కూలీలు బతుకుదెరువు కోసం కనీస చర్యలు చేపట్టలేదు.

– పగడాల యాదయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి

❖ పన్ను మినహాయింపు భేష్



మధ్యతరగతి వేతన జీవులు ఆశించిన ఊరట లభించింది. రూ.12 లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయించడం ఉద్యోగులు స్వాగతించే అంశం. కిసాన్ క్రెడిట్ కార్డ్ రూ.5 లక్షలకు పెంచడం, ఎలక్ట్రిక్ వెహికల్స్ సానుకూల అంశాలు. ఇన్పుట్స్ రేట్లు తగ్గించడం ఉత్పత్తులపై కనీస మద్దతు ధరలు పెంచడం ద్వారా రైతులను ఆదుకోవచ్చు. వస్తుసేవల మీద పరోక్ష పన్నులు, జీఎస్టీ వంటి వాటిని పెంచకపోతే మధ్యతరగతి చేతిలో కొనుగోలుశక్తి ఉంటుంది.

– వంగూరి గంగిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, షాద్‌నగర్

❖ అన్ని వర్గాలకు మేలు



కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉంది. ముఖ్యంగా మధ్య తరగతి వర్గాలు, వేతన జీవులపై వరాల జల్లు కురిపించింది. పన్ను మినహాయింపు నిర్ణయంతో ఏటా రూ.25 లక్షల వేతనం పొందేవారికి కనీసం రూ.1.10 లక్షలు మిగులుతుంది. రిటైర్డ్ ఉద్యోగుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై భారీగా పన్నులు తగ్గే అవకాశం లేకపోలేదు. మందుల ధరలు తగ్గించి వృద్ధాప్యంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి మరింత ఊరట కల్పించింది.

– సీహెచ్ రామారావు, రిటైర్డ్ బ్యాంక్ జోనల్ మేనేజర్, బడంగ్‌పేట్

❖ ఉద్యోగులకు ఊరట



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఊరట కలిగించేలా ఉంది. రూ.12లక్షల వార్షిక ఆదాయం వరకు పన్ను మినహాయింపు ఇచ్చింది. పన్ను స్లాబ్‌లను రూ.మూడు నుంచి నాలుగు లక్షలకు పెంచటం మంచి పరిణామమే. అయితే పొదుపుల ద్వారా వచ్చే మినహాయింపు పెంచకపోవటం, సీపీఎస్ ఉద్యోగుల స్టాండర్డ్ డిడక్షన్ పెంచకపోవటంతో ఉద్యోగ ఉపాధ్యాయులకు కొంత ఇబ్బందికరమే.

– గణపురం సురధీర్, టీపీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు

యాక్షన్ ప్లాన్ సిద్ధం



- పన్నుల వసూలుకు ప్రత్యేక ప్రణాళిక
- 50 రోజుల్లో.. 100 శాతం లక్ష్యం
- ఈ మేరకు సిబ్బందితో కలిసి కృషి
- అభివృద్ధిలో నా మార్క్ చూపిస్తా..
- 'సాక్షి'తో శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్

సాక్షి INTERVIEW

శంకర్‌పల్లి: 'వచ్చే 50 రోజుల్లో మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న పన్నులన్నీ వసూలు చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. అందుకు తగ్గట్లు సిబ్బందిని ఇప్పటికే అప్రమత్తం చేశాం. శత శాతం కోసం నిర్విరామంగా కృషి చేసి, మున్సిపాలిటీని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తాం. పన్నులు మాత్రమే కాదు.. అభివృద్ధిలో సైతం నా మార్క్‌ని చూపించేందుకు సిద్ధంగా ఉన్నాను' అంటున్నారు శంకర్‌పల్లి నూతన మున్సిపల్ కమిషనర్ ఎ.యోగేష్. 'సాక్షి'తో ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే..

కమిషనర్‌గా కొత్త ప్రయాణం

2009లో మున్సిపల్ శాఖలో నా ప్రయాణం మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 16 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేశాను. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై శంకర్‌పల్లి మున్సిపాలిటీకి మొదటిసారిగా వచ్చాను. పరిస్థితులను పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తున్నాను. వార్షిక సంవత్సరం ముగియడానికి ఎక్కువ సమయం లేదు కాబట్టి మొదటగా పన్ను వసూళ్లపై దృష్టి సారిస్తాను. నిధులుంటేనే అభివృద్ధి పనులు చేసేందుకు వీలవుతుంది.

శాఖలపై పూర్తి అవగాహన

వివిధ హోదాల్లో పని చేయడం ద్వారా మున్సిపాలిటీలోని అన్ని శాఖలపై పూర్తి స్థాయి అవగాహన ఉంది. శంకర్‌పల్లి మున్సిపాలిటీ స్వరూపం, పరిస్థితులపై ఇప్పటికే కొంత పరిజ్ఞానం ఉంది. కింది స్థాయి ఉద్యోగుల నుంచి ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతాను. మున్సిపల్‌వాసులకు ఎక్కడా ప్రజాప్రతినిధులు లేని లోటు కనిపించకుండా, నా మార్క్ పాలన అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తా. ఇప్పటికే వివిధ సమస్యలు దృష్టికి వచ్చాయి. వాటికి వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తా.

పన్నుల కోసం ప్రత్యేక బృందాలు

మున్సిపాలిటీలో ఇప్పటి వరకు పాత, కొత్త పన్నుల వసూళ్లు 30 శాతం పూర్తి కాలేదు. దీనిపై ఇప్పటికే అధికారులు, బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించాను. వచ్చే 50 రోజులు కీలకం. సిబ్బంది అత్యవసరమైతే తప్ప విధులకు గైర్హాజరు కావొద్దని సూచించాను. పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలుగా విభజించి వసూలు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ప్రచార రథాలు, పోస్టర్ల ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వడంతో పాటు అవగాహన కల్పిస్తాం

పారిశుద్ధ్యంలో రాజీ పడబోం..

ప్రతి వార్డు, కాలనీ, ప్రధాన రహదారులు.. ఇలా ప్రతి చోట నిత్యం చెత్త సేకరణ జరిగేలే చూస్తాం. మున్సిపల్ వాసులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ప్రజలు తమ ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి. తద్వారా ఎరువుల తయారీకి సులభతరం అవుతుంది. పారిశుద్ధ్యం విషయంలో ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి.

తాగునీటికి ఇబ్బంది రానివ్వం

మున్సిపాలిటీ పరిధిలోని శంకర్‌పల్లి, సింగాపూర్, బుల్కాపూర్, రామంతాపూర్, ఫత్తేపూర్‌లో తాగునీటి సమస్యలు రాకుండా మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తాం. వేసవిలో ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. బోర్లు పని చేయని చోట మరమ్మతులు చేయించి, తిరిగి వాడుకలోకి తెస్తాం.

పల్టీ కొట్టిన టిప్పర్



తుర్కయంజాల్: భారీ మట్టి లోడ్‌తో వెళ్తున్న ఓ టిప్పర్ అదుపు తప్పి పల్టీ కొట్టిన సంఘటన కమ్మగూడలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీ పక్కన ఓ భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం తీస్తున్న మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఓ టిప్పర్ (ఏపీ26టిటి9601) భారీ లోడ్‌తో గడ్డ ఎక్కుతుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి పల్టీ కొట్టింది. అదృష్టవశాత్తు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

న్యూస్‌రీల్

నాన్ బ్యాంకు యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్థిక పునరావాస పథకం ద్వారా దివ్యాంగులకు స్వయం ఉపాధి కింద నాన్ బ్యాంకు లింకేజీ యూనిట్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు తేదీని ఈనెల 12 వరకు పొడిగించినట్లు జిల్లా మహిళా సంక్షేమ అధికారి సంధ్యారాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వయం ఉపాధి కింద చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు చేపట్టాలనుకునే దివ్యాంగులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదరం, వయస్సు, విద్య, కులం ఆదాయ ధ్రువీకరణ, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ తదితర పత్రాలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కనీసం 40 శాతం పైగా వైకల్యం, 21నుంచి 55 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని చెప్పారు.

కొన్నా, అమ్మినా జరిమానా

కంసాన్‌పల్లిలో మద్యపాన నిషేధంపై తీర్మానం



మద్యపాన నిషేధంపై చేసిన తీర్మానాలతో ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: మండల పరిధిలోని కంసాన్‌పల్లిలో మద్యపాన నిషేధంపై గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉమ్మడి కంసాన్‌పల్లి పంచాయతీ పరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లి, పుల్చర్లకుంట, గిరాయిగుట్ట తండాకు చెందిన గ్రామస్తులు సమావేశమయ్యారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.15 వేలు, కొనుగోలు చేసిన వారికి రూ.10 వేలు జరిమానా విధించాలని తీర్మానించారు. మద్యం కొనుగోలు, అమ్మకాలు చేస్తున్న వారిని పట్టించిన వారికి రూ.5వేల నగదు బహుమతి అందజేస్తామని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో చాలా మంది యువకులు మద్యానికి బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, తద్వారా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అంతా కలిసి మద్యాన్ని నిషేధించాలని తీర్మానించినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం



షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని శనివారం జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ బృందం సందర్శించింది. డాక్టర్ కవిత, డాక్టర్ శక్తి మాళ్వికలతో కూడిన బృందం సభ్యులు ఆస్పత్రిలో జాతీయ క్షయ నిర్మూలన, వ్యాధి నిరోధక టీకాల పంపిణీ, కుటుంబ నియంత్రణ, మలేరియా నివారణ కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఆస్పత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారు, వారికి ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో ఫార్మసీ, ల్యాబ్‌లు, ఓపీ సేవలు, డయాలసిస్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, వైద్యులు మాధవి, విజయ్‌కుమార్, రాఘవేందర్, హర్షిత అరవింద్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఫార్మసిస్టులు సునీత, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రాధాన్యత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీజ్యోతి అన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే వారి పేరున అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి 60 మందితో ఏర్పాటు చేసిన మహిళా కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీజ్యోతి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్లలోపు వాడే గృహాలకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారున. ప్రభుత్వానికి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చిపెట్టాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షురాలు రమ్యశ్రీ, ఎ బ్లాక్ ప్రెసిడెంట్ పి.అనిత, మహేశ్వరం నియోజకవర్గం ప్రెసిడెంట్ సమత, శేరిలింగంపల్లి ప్రెసిడెంట్ చంద్రిక, బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కొందరికే సంక్షేమం



పరిగి ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

కుల్కచర్ల: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కొందరికే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని.. అందరికీ అమలు చేశామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కుల్కచర్ల మండలం దాస్యా నాయక్ తండాలో శనివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. బీఆర్ఎస్ నాయకులు ఎక్కడికి వెళ్లినా అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రజల తరఫున పోరాటం చేస్తామని ప్రకటించారు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. ప్రతి నెలా మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఏమైందని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. అబద్ధాలతో కాలయాపన చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారును అడుగడుగునా ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, పట్నం నరేందర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, బాల్క సుమన్, భూక్య సంజీవ్ నాయక్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, శుభప్రద్ పటేల్, అజయ్ నాయక్, శంకర్‌నాయక్, రాజు, అంగూర్, సుధాకర్ రెడ్డి, రాజు, మేగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు. లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లిన ఏ–2 సురేష్‌ను, గోపాల్ నాయక్‌ను సన్మానించారు. నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే గిరిజనుల భూములను లాక్కునే ప్రయత్నం చేసి వారినే జైలులో వేయడం జరిగిందని.. ఇంతటి నీచమైన సంస్కారం సీఎం రేవంత్‌రెడ్డిదని కేటీఆర్ అన్నారు.

ఘన స్వాగతం

పరిగి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కుల్కచర్ల మండలం దాస్య నాయక్ తండాలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో పరిగి పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కేటీఆర్‌ను గజమాలతో సత్కరించారు. ఆయన రాకతో పార్టీకి పూర్వ వైభవం ఖాయమని నాయకులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శనివారం ఇంటర్ పరీక్షలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 5వ తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు చేపట్టాల్సిన పనులను సమన్వయంతో చేయాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, డివిజన్ స్థాయిలో సంబంధిత అధికారులతో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేయాలని సూచించారు. ఆర్డీఓ కార్యాలయాల్లో ఎగ్జామ్ సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష విధులు నిర్వర్తించే ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు.

185 పరీక్ష కేంద్రాలు.. 1,47,211 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం 185 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఫస్టియర్‌లో 77,863 మంది, సెకండియర్‌లో 69,348 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు చెప్పారు. 31 ప్రశ్నపత్రాల స్టోరేజ్ పాయింట్లు ఉంటాయని తెలిపారు. పోలీసుశాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని, 144 సెక్షన్ విధించాలని, పరీక్ష సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని, పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆయా శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన తాగునీరు, ఫ్యాన్లు, టాయిలెట్స్, ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

షాద్‌నగర్‌రూరల్: గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఒకరోజు దీక్ష చేపట్టారు. దీక్షకు రాంబల్‌నాయక్‌తోపాటు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మిట్టునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ.. దేశంలో 12కోట్ల జనాభా కలిగిన బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి పంపాలని సూచించారు. 12 కోట్ల గిరిజనులు మాట్లాడుతున్న గోర్‌బోలిభాషను అధికర భాషగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజులనుకు 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రూ.500 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయాలని కోరారు. గిరిజన సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మోహన్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, హన్యానాయక్, రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, మోహన్, సంజీవ్‌నాయక్, శ్రీనివాస్, రాజునాయక్, బాబురాజ్ పాల్గొన్నారు.

మాదిగల ఐక్యతను చాటాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

షాబాద్: మాదిగల ఐక్యతను చాటి, మహాసభను విజయవతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో శనివారం ఎమ్మార్పీఎస్ మహాసభ వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేల గొంతులు, లక్ష డప్పులు మహాప్రదర్శన విజయవంతం చేయడం ద్వారా రాష్ట్రంలో మాదిగల ఐక్యతను చాటాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ చేపట్టిన 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం దక్కిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 7న ప్రతీ మాదిగబిడ్డ చంకన డప్పుతో నగరానికి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముక్కు విశ్వం మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు దోస్వాడ నర్సింహులు మాదిగ, జిల్లా నాయకులు జోగు అశోక్‌కుమార్ మాదిగ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన ప్రత్యేక పాలన!

మెజార్టీ జీపీల్లో నిధుల కొరత
- కన్నెత్తి చూడని స్పెషల్ ఆఫీసర్లు
- అవస్థలు పడుతున్న కార్యదర్శులు

దౌల్తాబాద్: ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వీటిని ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గత ఏడాది ఫిబ్రవరి 1నుంచి ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. వీరు పెద్దగా పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో భారమంతా కార్యదర్శుల పైనే పడుతోంది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతేడాది జనవరి 31వరకు పదవుల్లో కొనసాగిన అనేక మంది సర్పంచ్‌లు అప్పు లు చేసి, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ రోజు వరకూ వీరికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా జీపీల బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు ఏదైనా కార్యక్రమం ఉంటే తప్ప అటువైపు వెళ్లడం లేదు.

నిధులు లేవు.. పనులు సాగవు

ప్రత్యేకాధికారుల పాలనలో కేంద్రం నుంచి వచ్చే నిధులు రావడం లేదు. దీంతో రాష్ట్రం నుంచి వచ్చే అరకొర గ్రాంట్స్‌తో పాలన కష్టతరంగా మారిందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనీసం పంచాయతీ వర్కర్ల వేతనాల చెల్లింపులకు ఇబ్బందిగా మారింది. వీధి దీపాలు, ట్రాక్టర్ డీజిల్ ఇతరత్ర ఖర్చులకు నిధులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొంతమంది సెక్రటరీలు అప్పులు చేసి మరి పనులు చేయిస్తున్నారు.


దౌల్తాబాద్‌లోని ఓ కాలనీలో సీసీ రోడ్డు దుస్థితి

అధికారుల సమన్వయ లోపం..

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు గ్రామస్థాయిలో ఉన్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కానీ అనేక గ్రామాల్లో సమన్వయ లోపం కనిపిస్తోంది. స్పెషల్ ఆఫీసర్లుగా ఉన్న మండల స్థాయి అధికారులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో తామెందుకు ఆరాటపడాలని భావిస్తున్నారు. ఫలితంగా అనేక గ్రామాల్లో పాలన కుంటుపడింది. వీటికి ప్రత్యేకాధికారులు ఎవరనేది కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా స్పెషల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలకు వెళ్లాలి

పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు గ్రామాలకు వెళ్లాలనే ఆదేశాలు ఉన్నాయి. సమస్యలపై కార్యదర్శులతో చర్చించి, పరిష్కారానికి కృషిచేయాలి.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి


యాచారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి

యాచారం: భూ సమస్యల పరిష్కారం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. యాచారం తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ సమస్యలపై ఫిర్యాదులు, రిజిస్ట్రేషన్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ అయ్యప్పను కలిసి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలపై ఆరా తీశారు. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, తహసీల్దార్ పరిధిలో ఉన్న పెండింగ్ ఫైళ్లను ఆర్డీఓ, కలెక్టర్ లాగిన్లకు పంపించాలని కోదండరెడ్డి సూచించారు.

క్విజ్ విజేతలకు బహుమతులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి తదితరులు

యాచారం: శ్రీశ్యామలా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నందివనపర్తి జ్ఞాన సరస్వతి దేవాలయంలో భగవద్గీత, శతక పద్యాలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు పోటీపడ్డారు. శతక పద్యాల విభాగంలో అనంతలక్ష్మి(పుడమి పాఠశాల యాచారం) ప్రథమ, కీర్తన (కేజీబీవీ ఇబ్రహీంపట్నం) ద్వితీయ స్థానంలో నిలిచారు. భగవద్గీత వ్యక్తిగత విభాగంలో సాయిశ్రీ (ఎడ్‌మార్ట్ స్కూల్ హయత్‌నగర్) ప్రథమ, అనంతలక్ష్మి (పుడమి స్కూల్ యాచారం) ద్వితీయ బహుమతులు సాధించారు. రామాయణంపై నిర్వహించిన పోటీల్లో గునుగుల్ ఆదర్శ పాఠశాల విద్యార్థుల బృందం ప్రథమ, గౌతమి విద్యాలయం టీం, నందివనపర్తి విద్యార్థుల బృందం ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో యాచారం, మంచాల మండల విద్యాధికారులు పాండురంగారెడ్డి, రాందాస్, జ్ఞాన సరస్వతి ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు పప్పు నాగేశ్వరరావు, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపులో పడి చిన్నారి మృతి


మృతదేహంతో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


పాలిషింగ్ యూనిట్‌లోని నీటి సంపు

- గౌతాపూర్ శివారు పాలిషింగ్ యూనిట్‌లో ఘటన
- వలస కుటుంబంలో విషాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు


బాలిక మృతదేహం

తాండూరు రూరల్: బతుకు దెరువు కోసం వచ్చిన ఓ వలస కుటుంబంలో విషాదం నెలకొంది. అప్పటి వరకు తమ వద్ద ఆడుకున్న చిన్నారి గంటల వ్యవధిలోనే విగత జీవిగా మారింది. ప్రమాదవశాత్తు భవనం పైనుంచి నీటి సంపులో పడి ఊపిరాడక మృతి చెందింది. ఈ హృదయ విషాదకరమైన సంఘటన తాండూరు మండలం గౌతపూర్ సమీపంలోని అజార్ పాలిషింగ్ యూనిట్‌లో శనివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఏఎస్‌ఐ రాజశేఖర్, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రం పూర్ణియా జిల్లా బేగంపూర్ ప్రాంతానికి చెందిన మేరాజ్, హసీనా దంపతులు ఆరేళ్ల క్రితం తాండూరుకు వలస వచ్చారు. వివిధ పాలిషింగ్ యూనిట్లో కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మహీకతన్(4), సిహాబ్ (ఏడాది) ఇద్దరు సంతానం. ప్రస్తుతం వీరు ఆరు నెలలుగా గౌతపూర్ శివారులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న అజార్ పాలిషింగ్ యూనిట్లో పనిచేస్తూ, ఇక్కడే మేడపైన ఓ అద్దె గదిలో ఉంటున్నారు.

ఏం జరిగిందంటే..

రోజు మాదిరిగానే శనివారం ఉదయం మేరాజ్ పాలిషింగ్ యూనిట్ వద్ద పని చేస్తున్నాడు. భార్య హసీనా అతనికి ఫోన్ చేసి పెద్ద పాప మహీ కతన్ కనిపించట్లేదని చెప్పడంతో హుటాహుటిన వచ్చి పరిసరాల్లో వెతికారు. అనుమానం వచ్చి గది వెనకాల ఉన్న నీటి సంపులో పరిశీలించగా పాప కనిపించింది. వెంటనే ఆమెను పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. మాతాశిశు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి వెళ్లారు. అప్పటికే చిన్నారి మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు.

భవనంపై నుంచిపడి..

మేరాజ్ పనికి వెళ్లగా.. హసీనా వంట చేస్తోంది. వీరి అద్దె గది వెనకాల ఆడుకుంటున్న మహీ కతన్ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద ఉన్న సంపులో పడి, ఊపిరాడక మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పాప మృతితో తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. మేరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాధితుల ఆందోళన

పాలిషింగ్ యూనిట్ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం చిన్నారి మృతదేహంతో తాండూరు– చించోళి మార్గంలో గౌతపూర్ వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో దిగివచ్చిన యాజమాన్యం మేరాజ్ పనిలో చేరిన సమయంలో అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.35 వేలు మాఫీ చేస్తామని, స్వస్థలానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మేడిపల్లిలో కారు బీభత్సం

- గుడిసెలోకి దూసుకెళ్లిన వైనం
- బాలుడికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


అక్షిత్ (ఫైల్)

మేడిపల్లి: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు నడిపి బీభత్సం సృష్టించాడు. గుడిసెపైకి కారు దూసుకెళ్లడంతో అందులోని బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాద్ జిల్లా పెద్దగూడూరు మండలం తేజావత్ రాంసింగ్ తండాకు చెందిన వాంకుడోత్ అశోక్, అనూష దంపతులు. అశోక్ మేడిపల్లి సీపీఆర్ఐ ప్రధాన రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. పక్కనే గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి మేడిపల్లి శ్రీనివాస నగర్‌కు చెందిన శివ కారులో అతివేగంగా అశోక్‌కు చెందిన గుడిసెపైకి దూసుకెళ్లాడు. ఆ సమయంలో గుడిసెలో నిద్రిస్తున్న అశోక్ కుమారుడు అక్షిత్‌ని (4) కారుతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలుడి తలకు తీవ్రగాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో బాలుడి తల్లిదండ్రులు గుడిసెలో లేకపోవడంతో వారికి ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. కాగా.. ప్రమాదానికి కారకుడైన శివకు సైతం గాయాలు కావడంతో అతడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

యువ వైద్యుడి ప్రాణం తీసిన అతివేగం

- మరో మహిళా డాక్టర్‌కు తీవ్ర గాయాలు
- డివైడర్ మధ్యలోని హోర్డింగ్ స్తంభాన్ని ఢీకొన్న కారు


డాక్టర్ జస్వంత్ మృతదేహం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మణికొండ: అతివేగంతో దూసుకువచ్చిన కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలోని హోర్డింగ్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువ వైద్యుడు అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళా డాక్టర్ గాయాల పాలయ్యారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆస్పత్రిలో వి.జస్వంత్ (25), భూమిక హౌస్ సర్జన్‌లుగా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి వీరు కారులో శంకర్‌పల్లికి ఓ వివాహానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తెల్లవారుజామున ఖానాపూర్ వద్ద రోడ్డు మలుపును గమనించకుండా వేగంగా రావడంతో కారు అదుపు తప్పింది. రోడ్డు మధ్యలో డివైడర్‌పై ఉన్న హోర్డింగ్ స్తంభాన్ని ఢీకొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న జస్వంత్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. పక్క సీటులో కూర్చున్న భూమికకు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జస్వంత్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

FOR SALE
సిటీలో కూకట్‌పల్లి, మియాపూర్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, మోకిల్లా, Financial District చుట్టూరా... GATED COMMUNITY లో Ready to Occupy అపార్ట్‌మెంట్స్ ... Flat విస్తీర్ణం 1000 Sq.ft నుండి 5000 Sq.ft వరకు ... 200, 300, 400 గజాల ... ఈ Flat లు ...
✆ 9177993703 9390040288